క్లుప్తంగా

పరీక్షలపై అవగాహన



ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై విశ్రాంత ప్రొఫెసర్ చిగురుపాటి రామచంద్రయ్య, ఐటీ రంగ నిపుణుడు, చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గాడి ఇంతియాజ్‌అహ్మద్ అవగాహన కల్పించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు గ్రాఫాలజీ విద్య ద్వారా సంతకం ఎలా చేయాలి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఏబీఎన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేసులకు శాశ్వత పరిష్కారం

నందలూరు: నందలూరు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు 80 కేసులకు జడ్జి భార్గవి శాశ్వత పరిష్కారం చూపించారు. ఇందులో ఆరు సివిల్ తగాదాలు, నాలుగు పీఎల్‌సీలు, 70 క్రిమినల్ కేసులున్నాయి. ఈ కార్యక్రమంలో రమేష్, దాసరి నరసింహులు, సుబ్బరామయ్య, నూర్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న విజయభాస్కర్

రాయచోటి అర్బన్: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలకు పంగనామాలు పెట్టిందన్నారు. ఒక్కో జిల్లా నుంచి 15వేల మంది రుణాల కోసం దరఖాస్తు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం కేవలం 1300 మందికి సాయం అందించిందన్నారు. జగన్ ప్రభుత్వంలో కులమతాలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వం తమ పార్టీ నాయకుల సిఫారసులకే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయకుండా మభ్యపెడుతున్నారన్నారు. సమావేశంలో జానం రవీంద్ర, సంజీవయ్య, సాంబయ్య, రెడ్డిశేఖర్, రెడ్డిహరి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అరికట్టాలి

సిద్దవటం: అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని సిద్దవటం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు. మండలంలోని మాచుపల్లెలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన క్వారీల నుంచి మాత్రమే ఇసుక తీసుకెళ్లాల్సి ఉండగా, కొందరు నాయకులు పగలు, రాత్రి తేడా లేకుండా పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిమ్మకాయల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి తిరునాల



పూజలను నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు

సుండుపల్లె: మండలంలోని చెన్నంశెట్టిపల్లె, ఎల్లారెడ్డిగారిపల్లెలలో వెలసిన ఎల్లమ్మ ఆలయాల్లో తిరునాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చెన్నంశెట్టిపల్లెలో హోమం జరిపారు. పుట్ట బంగారు తెచ్చి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే తనిఖీలు



వాహనాలను తనిఖీచేస్తున్న సీఐ బాబు

సిద్దవటం: రోడ్డు ప్రమాదాల నివారణకే వాహనాలను తనిఖీ చేస్తున్నామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. మండలంలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంగా ప్రయాణించరాదని ఆయన సూచించారు. సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

సృష్టికి మూలం మహిళ

వీరబల్లి: సృష్టికి మూలం మహిళ అని సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ నాయక్ పేర్కొన్నారు. వీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో శనివారం మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఎస్ఐ మోహన్ నాయక్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులకు సమానంగా రాణిస్తున్నారన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితోనే మెరుగైన సమాజం



రాజంపేట టౌన్: మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్: మహిళాభ్యున్నతితోనే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మగపిల్లలు, ఆడపిల్లలనే బేధ భావం చూపవద్దన్నారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో ప్రవేశ పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకంతో తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులను చేశారని అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డితో కలసి పలువురు మహిళలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, దండుగోపి, జీవీ.సుబ్బరాజు, దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో

పట్టణంలోని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో 30 మంది ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వై.సుబ్రహ్మణ్యంరాజు, నరసింహ, చంద్రశేఖర్, శంకర్‌నాయక్, సత్యనారాయణ, ఓబులేసు, మోహన్ రావు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమాజంలో ప్రాధాన్యం ఇవ్వాలి

రైల్వేకోడూరు అర్బన్: సమాజంలో అమ్మగా, అక్కగా, భార్యగా చెల్లిగా, ఆద్యోగినిగా ఇలా అన్ని పాత్రలు సమర్థంగా నిర్వహించే మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని జెడ్పీటీసీ రత్నమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు.

సృష్టికి మూలం మహిళలు

రాయచోటి జగదాంబ సెంటర్: సృష్టికి మూలం మహిళలు అని సీనియర్ డాక్టర్ కోటేశ్వరి, డాక్టర్ అర్చన అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాయచోటి ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో బాలికల పుట్టుక తగ్గిపోతోందన్నారు. అనంతరం కోటేశ్వరి, అర్చనలను ఘనంగా సత్కరించారు. డాక్టర్ డేవిడ్ సుకుమార్, కిరణ్‌కుమార్, స్వాతి పాల్గొన్నారు.

విద్యతోనే అబలలకు గౌరవం

రాయచోటి అర్బన్: ఉన్నత విద్యతోనే మహిళలకు ఎంతో గౌరవం లభిస్తుందని ఎంపీపీ పల్లపు రాజమ్మ, ఎంపీడీఓ వెంకటేష్ అన్నారు. రాయచోటి ఎంపీడీవో కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిపారు. అనంతరం ఎంపీపీ రాజమ్మ, తదితరులను ఘనంగా సన్మానించారు. దివాకర్, రమేష్, రామ్మోహన్‌రెడ్డి, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే పురోగతి

సిద్దవటం: మహిళల అభివృద్ధితోనే సమాజం పురోగతి చెందుతుందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి అన్నారు. భాకరాపేటలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ హయాంలో మహిళలకు రాజకీయ పదవులు లభించాయన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

ఓబులవారిపల్లె: సమాజంలో మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధిస్తూ ముందుకు వెళ్తున్నారని బిజేపీ మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్‌కుమార్ రెడ్డి అన్నారు. కొర్లకుంట బీజేపీ కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మహిళలకు పసుపు, కుంకుమ చీరలు పంపిణీ చేశారు. వీటి చెంగల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు రమణ, తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం

సిద్దవటం: మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామని కమాండెంట్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. స్థానిక బెటాలియన్ యూనిట్ ఆసుపత్రిలోడాక్టర్ ఆర్.శిరీష, డాక్టర్ దివ్యరాణి పలువురు ఆఫీసర్స్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, వెంకటరెడ్డి, వెంకటశివుడు, ఎం.థియోఫిలస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతాశయాలతో ముందుకెళ్లాలి

నందలూరు: విద్యార్థులు ఉన్నతాశయంతో ముందుకెళ్లాలని రిమ్స్ డాక్టర్ సృజన, గైనకాలజిస్టు కామేశ్వరమ్మ పేర్కొన్నారు. గొబ్బిళ్ల అక్షర స్కూల్‌లో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. గోల్డ్ మెడల్ సాధించిన లక్ష్మీ చైతన్య, షేక్‌జైనబ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. డాక్టర్లను సన్మానించారు. అనంతరం షీ రూమ్స్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు సలహాలు అందజేశారు. గొబ్బిళ్ల త్రినాథ్, గొబ్బిళ్ల శ్రీనాథ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

రాయచోటి అర్బన్: అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలని వైద్యులు జీనత్ బేగం, రాధిక అన్నారు. స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవ వేడుక నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు స్త్రీలు రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం దేవి ప్రశాంతి, జీనత్‌బేగం, రాధిక, పద్మయాదవ్, రమాదేవి తదితరులన సన్మానించారు. ప్రసాద్ యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, దేవేంద్ర, ప్రమీలమ్మ, ప్రతిభ, వరలక్ష్మి, పార్వతమ్మ పాల్గొన్నారు.

రాయచోటి ఆర్టీసీ డిపోలో

స్థానిక ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు కె.లక్ష్మీదేవి, జి.లక్ష్మీదేవి, వియస్.జయంతి, ఆర్.విజయకుమార్, ఎస్.కమలమ్మలను మహిళా ఉద్యోగినులు సన్మానించారు. క్రిష్ణమూర్తి, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: స్వశక్తితో తమను మహిళలే రక్షించుకోవాలని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దాక్షాయని అన్నారు. స్థానిక గ్లోబల్ పబ్లిక్ స్కూల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రాయచోటి టౌన్: పట్టణంలోని ఆపస్ కార్యాలయంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, టి.నాగేశ్వరరావు, కవిత, పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంటిమిట్ట పంచాయతీ సచివాలయంలో జరిగిన వేడుకకు కార్యదర్శి సుధాకర్, భానుప్రకాష్, కట్టాయానాదయ్య హాజరయ్యారు.

ఓబులవారిపల్లె: జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమం నందు పాణ్యం సుబ్రమణ్యం స్వామి ఎనిమిది మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. మహిళలను సన్మానించారు.

చిట్వేలి: చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలా జ్యోతి ఆధ్వర్యంలో మైసూరువారిపల్లి సర్పంచ్ సంయుక్త మాజీ సర్పంచ్ కట్టా ఉమాదేవిలను సన్మానించారు. సిబ్బందికి పోటీలు నిర్వహించారు.



ఒంటిమిట్ట సచివాలయంలో...



ఓబులవారిపల్లె: కుట్టుమిషన్లు అందజేత



రాయచోటి: ఎంపీపీ రాజమ్మను సన్మానిస్తున్న అధికారులు



రెల్వే కోడూరు: మాట్లాడుతున్న రత్నమ్మ



ఓబులవారిపల్లె: చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న కమాండెంట్ ఆనంద్‌రెడ్డి



రాయచోటి ఎన్‌జీవో కార్యాలయంలో మహిళలకు సన్మానం

జగన్ పాలనలోనే మహిళలకు సామాజిక న్యాయం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రాయచోటి టౌన్: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళలకు సామాజిక న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయనతోపాటు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు. కేక్ కట్ చేసిన అనంతరం మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మలకు నేనున్నాంటూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ప్రాధాన్యత ఇచ్చింది జగన్ ప్రభుత్వమే అన్నారు. అన్ని రకాల పథకాలలో మహిళలనే లబ్ధిదారులుగా చేసి సాధికారితకు కృషి చేయడమేగాక, 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని సంక్షేమ పథకాలు వారికి అందేలా జగన్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిత ఆనంద్, నాగరాజమ్మ, పద్మావతి, షేక్ ఫర్వీన్, లక్ష్మిదేవి, రాజేశ్వరి, జానంరాధ, పద్మజ, సపూన, ఫయాజూర్ రహిమాన్, వివేకాందరెడ్డి, విజయభాస్కర్, ఈశ్వర్‌ప్రసాద్, శ్యామ్, రవీంద్ర యాదవ్, ముకుందపురం నరేష్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శివశంకర్, సెద్దిరెడ్డి, చిన్నసంజీవయ్యపాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ కార్యాలయంలో..



మహిళలను సన్మానిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ శైలజ, ఎంపీటీసీ పుష్పలత, నారాయణమ్మ, బుజ్జమ్మ, గౌసియాలను జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర ఘనంగా సన్మానించారు. సుబ్బరామరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రగతి సాధించేలా చేయూతనిద్దాం

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించేలా చేయూత ఇవ్వాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలోని శివాలయం కూడలి నుంచి జరిగిన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. నేతాజీ సర్కిల్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. అనంతరం జరిగిన మహిళా దినోత్సవ వేడుకలో ఎస్పీ మాట్లాడుతూ బాల బాలికలు, యువతులు, మహిళలు, వృద్ధుల కోసం భరోసా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్కూల్, కళాశాల ప్రాంతాలలో బాక్సులు ఏర్పాటు చేస్తామని, సమస్య వచ్చినప్పుడు ఒక పేపర్ మీద రాసి భరోసా బాక్సులో వేస్తే పోలీసులు సహకారం అందిస్తారన్నారు. డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజారమేష్, చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

99 శాతం మరమ్మతులు పూర్తి చేశాం



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

రాయచోటి అర్బన్: జిల్లాలో గోతుల రోడ్లకు 99 శాతం మరమ్మతులు పూర్తిచేసినట్లు జిల్లా ఆర్అండ్‌బీ అధికారులు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి తెలిపారు. రాయచోటికి విచ్చేసిన మంత్రిని వారు మర్యాదపూర్వకంగా కలిసి వారు సత్కరించారు. జిల్లాకు రూ.14 కోట్లు కేటాయించగా పనులు పూర్తిచేశామన్నారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. జిల్లాలో వర్క్ ఇన్స్‌పెక్టర్ల కొరత ఉందని సిబ్బంది తెలుపగా, సచివాలయాల సిబ్బందిని ఉపయోగించుకుంటే బాగుంటుందన్నారు. రూ.8 కోట్ల నిధులు కేటాయిస్తే రాయచోటి రింగురోడ్డు పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేష్

రాయచోటి అర్బన్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ రాజమ్మ, ఎంపీడీఓ వెంకటేష్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలను సరిచేసి నీటి వృథాను అరికట్టాలని, పల్లెల్లో నీటి సమస్య గుర్తించి ప్రజా ప్రతినిధులు అధికారులకు తెలియజేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామన్నారు. ఉపాధి హామీ పతకం కింద పొలాల్లో ఇంకుడు గుంతలు, మట్టి కట్టల నిర్మాణం, మామిడి తోటల్లో నీటి కుంటలు నిర్మించుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని మండల ఉపాధ్యక్షుడు సైకం జయపాల్‌రెడ్డి అన్నారు. కూలీల మస్టర్ తీసుకుని గైర్హాజరైన వారి పేర్లు ఉంటే వెంటనే తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు. విద్యార్థుల ఆహార అలవాట్లను బట్టి మధ్యాహ్న భోజనం మెనూ అమలుచేస్తామని ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వీర గంగమ్మ తిరునాల

ఒంటిమిట్ట: మండలంలోని మలకాటిపల్లి సమీపంలో వెలసిన వీర గంగమ్మ తిరునాలలో రెండో రోజున వైభవంగా కొనసాగింది. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి అలంకరించారు. అనంతరం మహా నివేదన, దశ విధ హారతులు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పాటూరు గంగిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు వరుస బహుమతులుగా రూ.60వేలు, రూ.40వేలు, రూ.23వేలు, రూ.20వేలు ఇవ్వనున్నారు.

వైభవంగా జాతర

వీరబల్లి: మండల కేంద్రంలో వెలసిన వీరభద్ర గంగమ్మ జాతర శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, పూజలు, హోమాలు జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలి



కేక్ కోస్తున్న న్యాయమూర్తులు

రాజంపేట: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని రాజంపేట జిల్లా మూడో అదనపు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజంపేట న్యాయస్థానంలో న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ చరిత్రలో మహిళలకు ఉన్న చట్టాలు, హక్కుల గురించి జడ్జి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శంకర్, ఏపీపి రసూల్ రెహాన, మహిళా న్యాయవాదులు సులోచన, సాయి ప్రశాంతి, సరిత, ఆశా ప్రియ, మౌనిక్, నాసరుద్దీన్, మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కృష్ణకుమార్, ఎస్‌బీఐ మేనేజర్ పుష్పలత తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, కాశీ, శ్రీనివాసులు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా న్యాయవాదులు, మహిళా న్యాయ స్థాన సిబ్బందిని శాలువలతో సన్మానించారు.

ఆంజనేయుడికి పూజలు

చిన్నమండెం: మండలంలోని బలిజపల్లె సమీపంలో వెలసిన వీరాంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను అందమైన పుష్పాలతో అలంకరించారు. స్వామికి ఆకులు, సిందూరంతో పూజలు జరిపారు. అర్చకులు ప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో..

సంబేపల్లె: మండలంలోని అడవికమ్మపల్లెలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అభిషేకాలు, అర్చనలు జరిపారు.

ఉపాధి కూలీకి గాయాలు

సంబేపల్లె: మండలంలోని కొండ్లావాండ్లపల్లెకు చెందిన ఉపాధి కూలీ విమలమ్మకు స్వల్పగాయాలయ్యాయి. ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన ఆమె ప్రమాదశాత్తూ గుంతలో పడి గాయాలవడంతో ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కెఆర్ ఎం.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశం నిర్వహణకు ఎంపీటీసీ సభ్యుల కోరం లేకపోవడంతో వాయిదా వేశామని తెలిపారు. అయితే వరుసగా మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడుతుండటంతో నీటి సమస్యలపై చర్చ లేకుండాపోయింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని సమస్యలపై చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపకార వేతనాలకు ఎంపిక



ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

పెనగలూరు: మండలంలోని నల్లపురెడ్డిపల్లి నుంచి ఐదుగురు విద్యార్థులు సుదీప్తి, దేవకి, నాగచైతన్య, దీక్షిత, రేణుకలు నేషనల్ మీన్స్‌కం మెరిట్ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి-1 ఎం.గిరివరదయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారికి నాలుగేళ్లలో రూ.48 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

సుండుపల్లె: మండలంలోని తూర్పు మాలపల్లి సమీపంలో 300 లీటర్ల నాటుసారా ఊటను ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం ధ్వంసం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



సుండుపల్లె నుంచి పెద్దబలిజపల్లె, సామిసేనిగడ్డకు వెళ్లే రహదారి గోతులతో నిండిపోయింది. స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. నడిచి వెళ్లడానికి వీలు లేకుండా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – సుండుపల్లె

ఎర్ర బస్సు రాక.. అవస్థ

జిల్లా కేంద్రం ఏర్పాటు చేసినా.. అక్కడి నుంచి ప్రధాన పట్టణాలకు బస్సులు నడపడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. 92 కిలోమీటర్లు ప్రయాణం చేసేందుకు ప్రజలు అపసోపాలు పడుతున్నారు. నేరుగా బస్సులు లేక నానా వస్థ పడుతున్నారు.

- జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే అపసోపాలు
- నేరుగా బస్సులు లేక ప్రయాణికుల పాట్లు



రాయచోటికి వెళ్తున్న పల్లె వెలుగు బస్సు

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. మంగంపేట బెరైటీస్ ఖనిజం ఇక్కడే ఉంది. అయినా జిల్లా కేంద్రం రాయచోటికి రైల్వేకోడూరు నుంచి వెళ్లాలంటే నేరుగా బస్సులు లేవు. గతంలో కడప జిల్లాలో రైల్వేకోడూరు నియోజకవర్గం ఉండేది. ప్రస్తుతం రాయచోటికి మారడంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు నానవస్థ పడుతున్నారు. గతంలో రైళ్లు, బస్సులు అనుకూలంగా ఉండేవి. జిల్లా విభజన అనంతరం రైల్వేకోడూరు నుండి రాయచోటికి, రాయచోటి నుంచి రైల్వేకోడూరుకు రావాలన్నా సాహసం చేయాల్సిందే. మొత్తం 92 కిలోమీటర్లు కావడంతో రైల్వేకోడూరు నుంచి రాజంపేటకు చేరుకుని అక్కడి నుండి పల్లె వెలుగు బస్సులో రాయచోటికి వెళ్లాల్సి వస్తోంది. సకాలంలో పల్లె వెలుగు బస్సులు అందుబాటులో ఉండవు. దీంతో రాజంపేటకు వచ్చి అక్కడి నుండి సాయంత్రం సమయంలో రైల్వేకోడూరుకు వెళ్లాలంటే బస్సులు, వాహనాలు లేక ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. రైల్వేకోడూరు నుంచి ఏపీఎస్సార్టీసీ నేరుగా బస్సు సర్వీసులు నడపాలని, మూడు గంటలలో జిల్లా కేంద్రం చేరుకుంటామని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఐదు గంటల సమయం పడుతోందన్నారు. ఏపీఎస్సార్టీసీ మంత్రి చొరవ తీసుకొని రైల్వేకోడూరు నుంచి నేరుగా బస్సు సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జి చొరవ చూపించాలి

రైల్వేకోడూరు నుంచి రాయచోటికి, రాయచోటి నుంచి రైల్వేకోడూరుకు నేరుగా ఏపీఎస్సార్టీసీ బస్సు సర్వీసు నడిపించేందుకు, ప్రజల కష్టాలు తీర్చేందుకు జిల్లాకు చెందిన ఆర్టీసీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి చొరవ తీసుకొని సర్వీసు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలి.

– జ్యోతి చిన్నయ్య, సీపీఐ కార్యదర్శి, రైల్వే కోడూరు నియోజకవర్గం

జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే కష్టం

రైల్వేకోడూరు నుండి రాయచోటి కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లాల్సి వస్తోంది. అయితే నేరుగా బస్సు లేక రాజంపేటకు వెళ్లి అక్కడి నుంచి వెళ్లాలంటే సమయానికి బస్సులు లేవు. ఘాట్ రోడ్డు, గుంతల రోడ్డుపై వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. నేరుగా రాయచోటికి ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపితే ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎస్.ఇర్ఫాన్‌నవాబ్, వ్యాపారి, రైల్వేకోడూరు